చినుకు పడితే.. కునుకు కరువు

- బుడమేరు దిగువున ప్రమాదకరంగా మూడు గ్రామాలు
- గండ్లు పడితే ప్రమాదం ఊహకతీతం
- భయాందోళనల మధ్య గ్రామస్తుల జీవనం

జి.కొండూరు: భారీ వర్షాలు కురిసినప్పుడల్లా బుడమేరు విస్తీర్ణంలో ప్రధాన భాగమైన వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నిల్వ ఉండే నీటితో కవులూరు, వెలగలేరు, హెచ్. ముత్యాలంపాడు గ్రామాలకు ముప్పు పొంచి ఉంటోంది. ఏ క్షణమైనా కట్టలు తెగితే ఆ మూడు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంది. కాంక్రీట్ వాల్ నిర్మాణంతోనే ఆ ప్రమాదాన్ని నివారించవచ్చు.



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద బుడమేరు (ఫైల్)

మూడు గ్రామాలకు ముప్పే

బుడమేరుకు ఖమ్మం, తిరువూరు నియోజకవర్గాలతో పాటు మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల నుంచి వచ్చే వరద ప్రవాహం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నిలిచి డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణానదికి వెళుతుంది. 1956లో నిర్మించిన వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌కు 15 వేల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని మాత్రమే దిగువకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. రెగ్యులేటర్ నుంచి కృష్ణానది వరకు 11.90 కిలోమీటర్లు ఉన్న డైవర్షన్ కెనాల్ సైతం 37,555 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి తవ్వినప్పటికీ కాంక్రీట్ స్ట్రక్చర్ చేయకపోవడంతో 15 వేల క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తోంది. ఎగువున వరద ప్రవాహం ఎక్కువైన సమయంలో హెడ్ రెగ్యులేటర్ వద్ద 30 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం వెనుక వైపు లోతట్టు ప్రాంతాలన్నీ మునిగి నిల్వ ఉంటోంది. ఈ సమయంలో బుడమేరు కాల్వకు ఎడమ వైపు గండ్లు పడితే వెలగలేరు, కవులూరు గ్రామాలు, కుడి వైపు గండ్లు పడితే హెచ్. ముత్యాలంపాడు గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంది. 11,823 మంది జనాభా ఉండే ఈ మూడు గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి తీవ్ర నష్టం వాటిల్లింది. రెగ్యులేటర్ వద్ద నీరు నిల్వ ఉన్న సమయంలో భారీగా వరద ప్రవాహం పోటు వేసి జి.కొండూరు మండల పరిధిలోని కుంటముక్కల, చిన్న నందిగామ, వెల్లటూరు, కందులపాడు, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండల పరిధి కొండపల్లి, ఈలప్రోలు, శాంతినగర్ గ్రామాలు కూడా ముంపునకు గురవుతాయి. ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి ఆయా గ్రామాల్లో 5,705 ఎకరాల్లో వరి పంట, 3,567 ఎకరాలలో పత్తి పంటతో పాటు పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పశుగ్రాసం, ఇళ్లు కొట్టుకుపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు.

కాంక్రీట్ వాల్ నిర్మాణమే పరిష్కారం

వెల్లటూరు నుంచి కృష్ణా నది వరకు 20 కిలోమీటర్ల మేర బుడమేరుకు ఇరువైపులా కాంక్రీటు వాల్ నిర్మిస్తే తప్ప ఆయా గ్రామాలను ముంపు నుంచి కాపాడే అవకాశం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి గతంలో మిత్ర కమిటీ, శ్రీ రామకృష్ణయ్య కమిటీలు సిఫార్సు చేసిన రిజర్వాయర్లను ఎగువున నిర్మించడంతో పాటు, ఆక్రమణల తొలగింపు, కాంక్రీట్ వాల్ నిర్మాణం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడ నిర్మించాలి



ఇటీవల బుడమేరుకు వచ్చిన వరదతో గ్రామం అంతా వణికిపోయింది. బుడమేరు, పోలవరం కుడికాల్వ వెలగలేరు గ్రామం వద్దే కలుస్తాయి. కాల్వ కట్టకు గండిపడితే గ్రామం మొత్తం వరద ప్రవాహంలో కొట్టుకుపోయేది. భారీ వర్షాలు పడినప్పుడల్లా భయపడుతూ ఉండాల్సి వస్తోంది. బుడమేరు కాల్వకు రక్షణగోడ నిర్మించాలి.

– పోలుదాసు వెంకట్రావు, కవులూరు

డైవర్షన్ కెనాల్‌ను అభివృద్ధి చేయాలి



కవులూరు గ్రామం డైవర్షన్ కెనాల్‌ను ఆనుకొని ఉంది. ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి కెనాల్ కట్ట కోతకు గురైంది. కట్టకు గండిపడితే గ్రామంలోని వేల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ప్రభుత్వం సత్వరమే బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను లోతు పెంచి కాంక్రీటు వాల్ నిర్మించాలి.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు నాయకుడు, కవులూరు

భరోసా కల్పించాలి



బుడమేరు ముంపు గ్రామాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. హెచ్. ముత్యాలంపాడు గ్రామాన్ని ఆనుకొని ఉన్న బుడమేరుతో గ్రామానికి ఏ క్షణమైనా ముంపు తప్పదు. బుడమేరు కట్టలకు కాంక్రీట్ గోడలను నిర్మిస్తేనే ముంపు సమస్య తప్పుతుంది. లేదంటే బుడమేరు పొంగినప్పుడల్లా గ్రామం మునిగిపోతుంది.

– చల్లా నాగచలపతి, హెచ్. ముత్యాలంపాడు

క్లుప్తంగా

జగనన్న కాలనీలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన కొండపల్లి జగనన్న కాలనీలో శుక్రవారం పర్యటించారు. కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయం లేకపోవడాన్ని ఆమె గమనించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంజినీరింగ్ విభాగం అంచనాలు తయారు చేసిన అనంతరం గ్రావెల్ రోడ్లు నిర్మించి తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏఈ సాయి గణేష్, అధికారులు పాల్గొన్నారు.

సహాయ కమిషనర్‌గా సంధ్య

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌గా నేల సంధ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సాంబశివరావు ఎన్టీఆర్ జిల్లా ఏసీగా ఉన్నారు.

పలకల పంపిణీ

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు స్థానిక షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో శుక్రవారం పలకలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పెనుగొలను సూపర్‌వైజర్ రేవతి, విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, ప్రగతి స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో విజయ్ డానియేల్‌కు గోల్డ్ మెడల్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): సీబీఎస్ఈ సౌత్ జోన్–1 స్కేటింగ్ పోటీల్లో గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి శుక్రవారం తెలిపారు. కోయంబత్తూరులో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగిన స్కేటింగ్ పోటీల్లో పాఠశాల మూడో తరగతి విద్యార్థి విజయ్ డానియేల్ రింక్ –1 ఈవెంట్‌లో గోల్డ్ మెడల్, రింక్– 2 ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ఐదు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్న ఈవెంట్‌లో విజయ్ డానియేల్ ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

క్రీడా పోటీల విజేతలకు అభినందన

తిరువూరు: మండల స్థాయిలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో స్థానిక శ్రీనిధి హైస్కూల్ విద్యార్థులు 18 మంది విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ వెంకట నారాయణ తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయులు తిరుపతిరావు, నాగేశ్వరరావును కరస్పాండెంట్ కిశోర్‌బాబు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మిస్తున్న దాసాంజనేయస్వామి ఆలయానికి నిర్మాణ ట్రస్టు సభ్యులు కొల్లిపర సుబ్బారావు కుమార్తె ఆది చెంచులక్ష్మి రూ.35 వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. మన్నె సాంబశివరావు, మణికుమార్, సత్యనారాయణలు రూ.లక్షా 80 వేల విరాళాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందించారు.

విద్యార్థులకు పోటీలు

తిరువూరు: విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలు, ఆశయాలు అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. తేజశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, తిరువూరు అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు లోకేష్, సాగర్ ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వ్యాసరచనలో తిరువూరు అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థి కె. సందీప్, గానుగపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్. మేఘన, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సమీనా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జి.కొండూరు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరపున ఆడేందుకు జి.కొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థిని ఎస్. జాహ్నవి, ఎస్. శశి, ఎస్. ప్రియాంక, పి. కృప, సీహెచ్ యామినిలు విజయవాడ కేబీఎన్ కళాశాలలో గురువారం జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో అండర్–19 విభాగంలో ప్రతిభ చూపారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు, పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆగిరిపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

నెమలి మీదుగా హైదరాబాద్‌కు బస్ సర్వీసు

తిరువూరు: తిరువూరు నుండి గంపలగూడెం, నెమలి మీదుగా హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసును ఈ నెల 29 నుంచి ప్రారంభిస్తామని ఆర్టీసీ తిరువూరు డిపో మేనేజర్ వేణు తెలిపారు. తిరువూరులో ప్రతి రోజూ రాత్రి 8.45 గంటలకు బయలుదేరి గంపలగూడెం, పెనుగొలను, నెమలి, పినపాక, వైరా, ఖమ్మం, సూర్యాపేట మీదుగా హైదరాబాద్‌లోని మియాపూర్‌కు ఉదయం 5.15 గంటలకు చేరుతుందన్నారు. 3828 సర్వీసు నంబర్‌కు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని చెప్పారు. తిరుగు ప్రయాణంలో 3829 సర్వీస్ నంబర్‌తో హైదరాబాద్ మియాపూర్‌లో రాత్రి 9.30 గంటలకు బయలుదేరి ఉదయం 6 గంటలకు తిరువూరు చేరుతుందని వివరించారు.

రెడ్డిగూడెం ఏపీఎంగా రామకృష్ణ

మైలవరం: రెడ్డిగూడెం మండలం వెలుగు ఏపీఎంగా బొలగాని రామకృష్ణ శుక్రవారం డీఆర్‌డీఏ–వెలుగు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆగిరిపల్లి మండలం నుంచి బదిలీపై రెడ్డిగూడెం మండలానికి ఆయన వచ్చారు. రెడ్డిగూడెం క్లస్టర్ సీసీగా ఎం. మణి, కూనపురాజుపర్వ క్లస్టర్ సీసీగా ఎస్. సుందరమ్మ బాధ్యతలు చేపట్టారు.

- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లి మండల వెలుగు శాఖ ఏపీఎంగా దయాల రాజశేఖర్ శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రాజశేఖర్ నూజివీడు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఏపీఎం బొలగాని రామకృష్ణ రెడ్డిగూడెం మండలానికి బదిలీ అయ్యారు.

నిత్యావసరాల పంపిణీ

నూజివీడు: సెయింట్ విన్సెంట్ డి పాల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు పి. రామారావు, సొసైటీ ప్రతినిధి చేబత్తిన మున్నా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు అడుగులు వేద్దాం



మైలవరంలో విద్యార్థుల మానవహారం



పవిత్రసంగమం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు

కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన

ఇబ్రహీంపట్నం: సమాజంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన అన్నారు. విజయవాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ హిత వస్తువుల వాడకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ మై భారత్ పోర్టల్‌లో విద్యార్థులను భాగస్వాములను చేశామన్నారు. వారి ద్వారా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. యువ కేంద్రం సభ్యులు బి.వినోద్‌కుమార్, నిమ్రా, లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

మైలవరం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం మానవహారం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఫణికుమార్, మన్నే స్వామి పాల్గొన్నారు.

వరద బాధితుల ఆందోళన

వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న వరద బాధితులు

ఇబ్రహీంపట్నం: వరద బాధితుల్లో అర్హులకు నష్టపరిహారం అందించాలని మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కొండపల్లి మున్సిపాల్టీతో పాటు ఈలప్రోలు, కేతనకొండ తదితర వరద ముంపు గ్రామాల్లో నష్టపరిహారం అంచనాల తయారీలో అధికారుల నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుడమేరు వరద ముంపునకు గురైన ఈలప్రోలు గ్రామం వరద ముంపునకు గురికాలేదని చూపించడం అధికారుల దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్వం కోల్పోయినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం నమోదుకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పయ్యావుల రాము బాధితులకు మద్దతు తెలిపారు.

కుక్కలు, కోతుల బెడద అరికట్టాలి

తిరువూరు: తిరువూరు పట్టణంలో కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలని నగర పంచాయతీ కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు నాళ్లా సురేంద్ర, షేక్ హుస్సేన్ కోతులు, కుక్కల బెడదపై చర్చించారు. వీధి కుక్కల దాడిలో పలువురు గాయపడుతున్నందున తగు చర్యలు చేపట్టాలని, కుక్కలు, కోతులను పట్టి దూరంగా వదిలిపెట్టాలని కోరారు. దోమకాటుతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నందున ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఎం. దుర్గారావు కోరారు. వైస్ చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి, కమిషనర్ లోవరాజు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ గార్గేయి, నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీల నిరసన

నూజివీడు: పౌర సరఫరాల కార్పొరేషన్ మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్, అన్ లోడింగ్ పాయింట్లలో పనిచేసే కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. నూజివీడు సివిల్ సప్లై గోడౌన్ వద్ద శుక్రవారం ఉదయం కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కూలి రూ.30 చేయాలని, బోనస్ రూ.10 వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై ముఠా యూనియన్ జిల్లా కార్యదర్శి రాంబాబు, క్రాంతి, తాతారావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత

జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన సానం తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. ఈ క్రమంలో ఆమెకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.87,758 పత్రాన్ని బాధిత కుటుంబానికి స్థానిక టీడీపీ మండల నాయకులు శుక్రవారం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మండలంలోని వేల్పుచర్లకు చెందిన ఉమా మహేశ్వరరావు (18) ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. కాలేజీకి వెళ్లి చదవాలనే ఆసక్తి తగ్గడంతో మనస్తాపానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు కాలేజీకి వెళ్లాలని చెబుతుండటంతో ఈనెల 17వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. బంధువులు అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నూజివీడు: మండలంలోని మొర్సపూడి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌కు చెందిన భరోతు సాలి పని నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆటోలో మొర్సపూడి వెళ్లింది. ఆటో దిగి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి.

స్పందించిన మంత్రి పార్థసారథి

అదే సమయంలో మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు వస్తుండగా ఆగి బాధితురాలిని ప్రత్యేక వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రి పంపించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్‌కు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

స్వర్ణాంధ్ర 2047 పోటీల విజేతలు వీరే

ముసునూరు: స్వర్ణాంధ్ర 2047 మండల స్థాయి పోటీల విజేతల వివరాలను ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో వ్యాస రచన విభాగంలో గురుకుల విద్యార్థిని సాయివర్షిణి, వక్తృత్వంలో చెక్కపల్లి చైతన్య విద్యార్థి పూజిత్, డిబేట్‌లో కాట్రేనిపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నాగసత్య మానస ప్రథమ స్థానాలు సాధించారని ఎంఈఓ చెప్పారు.

30న మండల సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జోత్స్న అధ్యక్షతన ఈనెల 30న జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: బంగినపల్లితోట ఏరియాలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా రామలక్ష్మి

గంపలగూడెం: గంపలగూడెం మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బి. రామలక్ష్మి (ఊటుకూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెలుగు ఏపీఎం రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షురాలిగా నాగోలు విజయకుమారి (మేడూరు), కార్యదర్శిగా కోలా మాధవి (పెద్దకొమిర), జాయింట్ సెక్రటరీగా ఎం. రజని (గుళ్లపూడి), కోశాధికారిగా ముచ్చింతల యశోద (గంపలగూడెం) ఎన్నికయ్యారు.

కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్

ఇబ్రహీంపట్నం: విదేశీ విద్యకు అవసరమైన పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికతో చదవాలని అకడమిక్ ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ జీవీ జై కిషన్ అన్నారు. స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అకడమిక్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. రుణ సదుపాయాలతో ఎలా విదేశీ విద్యను పూర్తి చేయాలి అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్దన్, మోహన్‌కృష్ణ, ప్రొఫెసర్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్‌కు నివాళి

ఎ.కొండూరు: కార్మికోద్యమ నాయకుడు, సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి ఏబీ బర్ధన్ శత జయంతి కార్యక్రమాన్ని ఎ. కొండూరు బీసీ కాలనీలో సీపీఐ శ్రేణులు శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ ఏబీ బర్ధన్ సేవలను కొనియాడారు.

ఎమ్మెల్యే కొలికపూడి వేధింపులు అరికట్టాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి తిరువూరు నేతల ఫిర్యాదు



విజయవాడ ఆయుష్ ఆస్పత్రి వద్ద గుమికూడిన తిరువూరు టీడీపీ నాయకులు

తిరువూరు: తమను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వేధింపులకు గురిచేస్తున్నారని తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో జరిగే అక్రమాలను అడ్డుకుంటున్నారనే కారణంగా చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావుపై పోలీసులను ఒత్తిడి చేసి కేసు నమోదు చేయించి అరెస్టు చేయించారని తెలిపారు. తుమ్మలపల్లిపై ఎమ్మెల్యే భౌతికదాడికి యత్నించడంతో ఆయన భార్య కవిత ఆత్మహత్యా యత్నం చేశారన్నారు. తిరువూరులో బహిరంగంగా సర్పంచిపైన, తెలుగుదేశం నాయకులపైన అసభ్య పదజాలంతో దూషణకు దిగి తమపై దాడులకు సైతం పాల్పడతామని హెచ్చరించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావుపై చర్య తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ పార్టీలో కుల చిచ్చు పెడుతూ ఎన్నడూ లేనివిధంగా కేడర్‌ను పార్టీకి దూరం చేసేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచి భార్య కవిత చికిత్స పొందుతున్న విజయవాడ ఆయుష్ ఆస్పత్రి ఎదురుగా కూడా తిరువూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

ఎమ్మెల్యే పనితీరుపై పార్టీ అధిష్టానం ఆరా..

ఎమ్మెల్యేపై నాయకులు చేసిన ఆరోపణల పరిశీలనకు క్రియాశీలక కార్యకర్తలతో నేరుగా పార్టీ పెద్దలు ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారు. చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే దూషణపర్వం, ఆయన భార్య కవిత ఆత్మహత్యాయత్నం చేయడం, పార్టీ నాయకులు తన దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బయట తిరుగుతున్నారని, వారినందరినీ మూల కూర్చోబెట్టానని ఎమ్మెల్యే బాహాటంగా మాట్లాడిన తీరును అధిష్టానం సీరియస్‌గా తీసుకుని నాయకులతో సంప్రదింపులు జరుపుతోంది. టీడీపీ నాయకులు మరసకట్ల కుమార్, కొమ్ము బాబూరావు, గద్దె అనిల్, యండ్రాతి మాధవి, దొడ్డా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



తుమ్మగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి: యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మగూడెం, మర్లపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తామని, సొంత స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకుంటే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో రూ.57.50 లక్షల విలువ గల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరిడి చిట్టిబాబు, లక్ష్మణరావు, బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వేలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఎస్‌సీఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు



వ్యాగన్ వర్క్‌షాపును పరిశీలిస్తున్న శంకరరావు, యూనియన్ నాయకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు డిమాండ్ చేశారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపును శుక్రవారం ఆయన సందర్శించారు. వ్యాగన్ వర్క్‌షాపులో వివిధ విభాగాలను పరిశీలించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించేందుకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరుకు రవాణా చేసే వ్యాగన్ల మరమ్మతులు అధికంగా పెరిగాయన్నారు. రైల్వేలో పోస్టులు భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను నియమించుకుని వెట్టి చాకిరీతో వారి శ్రమదోపిడీ చేస్తున్నట్లు విమర్శించారు. రానున్న యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌కు విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. బ్రాంచి చైర్మన్, కార్యదర్శులు సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, డివిజనల్ కార్యదర్శి బుచ్చిరెడ్డి, కోశాధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ముసునూరు విద్యార్థులు

ముసునూరు: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారని రమణక్కపేట హైస్కూల్ హెచ్‌ఎం పీవీఎస్ రామకృష్ణ తెలిపారు. ఇటీవల నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ క్రీడా ప్రాంగణంలో అండర్–17 విభాగంలో నవ్య, భార్గవి, బాలుర విభాగంలో మణికంఠ, అండర్–14 బాలికల విభాగంలో నాగసుధ, జెస్సీ, ఇందుప్రియ ప్రతిభ కనపర్చి ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ తుది జట్టులో స్థానం సాధించారని చెప్పారు.

- వేల్పుచర్ల హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు అండర్–14 విభాగంలో వాలీబాల్, ఖోఖో పోటీలకు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. గుడిపాడు హైస్కూల్ విద్యార్థులు నలుగురు వాలీబాల్, ఒకరు కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం నిర్మలాదేవి తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆగిరిపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి అన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై తల్లులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ చొటపల్లి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.